క్లుప్తంగా

ఓటు నమోదుకు మరో అకాశం

నకరికల్లు: 18 ఏళ్ల వయస్సు నిండిన యువతీ యువకులు నూతన ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించిందని తహసీల్దారు ఎల్.లక్ష్మీనారాయణ శనివారం తెలిపారు. బీఎల్ఓల వద్ద ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, ఫొటో, పదో తరగతి విద్యార్హత పత్రం లేదా వయస్సు ధ్రువీకరణ పత్రంతో ఓటరుగా నమోదు కావచ్చన్నారు. ఈ అవకాశాన్ని నూతన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వడ్డవల్లిలో వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు



సత్తెనపల్లి: పట్టణంలోని వడ్డవల్లి రామాలయం, వేంకటేశ్వర స్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వర స్వామిని తులసి మాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులయ్యారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా భగత్ సింగ్ వర్ధంతి



అమరావతి: బ్రిటీష్ వలస సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశ స్వాతంత్ర్య పోరాటంలో చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించిన మహనీయుడు సర్దార్ భగత్‌సింగ్ అని మండల సీపీఎం కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన భగత్ సింగ్ వర్ధంతి కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. భగత్ సింగ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్డీ మొహీద్దీన్ వలి, ఎస్కే రఫీ, మచ్చా సుబ్రమణ్యం, నవీన్ పాల్గొన్నారు.

సేవా సంస్థకు విరాళం



సత్తెనపల్లి: పట్టణంలోని మిత్ర స్వచ్ఛంద సేవా సంస్థకు వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గజ్జల నాగభూషణం రెడ్డి శనివారం ఆర్థిక సాయం అందించారు.. విద్యార్థుల చదువుల ఫీజుల నిమిత్తం రూ.11,500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గజ్జల నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. స్వచ్ఛంద సేవా సంస్థకు తన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయన్నారు. ఆర్థిక సాయం అందజేసిన గజ్జల నాగ భూషణరెడ్డికి మిత్ర స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కరలపాటి శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అమ్మ చేయూత చారిటబుల్ సొసైటీ ప్రెసిడెంట్ కె.దస్తగిరి, విద్యార్థు లు, తదితరులు ఉన్నారు.

సాతులూరు చోరీపై దర్యాప్తు వేగవంతం

నాదెండ్ల: పట్టపగలే సాతులూరులో జరిగిన భారీ చోరీపై పల్నాడు జిల్లా క్రైం పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు వేగవంతం చేశారు. ఇప్పటికే క్రైం స్క్వాడ్ పోలీసులు వేలిముద్రలు, సాక్ష్యాలను సేకరించారు. ఆగంతకులు సుమారు 457 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.50 వేలు నగదు చోరీ చేసిన సంగతి తెలిసిందే. మార్కెట్లో వీటి విలువ రూ.27 లక్షల వరకూ ఉంటుంది.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

మాచవరం: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను గురజాల ఆర్డీఓ రమణా కాంత్ రెడ్డి శనివారం పరిశీలించారు. ఆయా పోలింగ్ బూత్‌ల వద్ద సౌకర్యాలు, మౌలిక సదుపాయాలు, రక్షణ తదితర అంశాలపై స్థానిక అధికారులతో చర్చించారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన రేగులగడ్డ, గోవిందాపురం బల్లకట్టు రేవులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల అధికారులు తగు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ వ్యవస్థ ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, కోడ్ ఉల్లంఘనకు పాల్పడితే చట్టపరంగా చర్యలు ఉంటాయని తెలియజేశారు. ఆయన వెంట తహసీల్దార్ శ్రీరామకృష్ణ, ఎస్ఐ అమీనుద్దీన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ఓటమి భయంతో టీడీపీ అడ్డదారులు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ప్రలోభాలు
- పచ్చ కండువాలు కప్పుకుంటే నగదు నజరానా
- వాస్తవాలు తెలుసుకుని సొంతగూటికి చేరుతున్న వైఎస్సార్ సీపీ కార్యకర్తలు



పొరపాటు తెలుసుకుని ఎమ్మెల్యే శంకరరావు సమక్షంలో మళ్లీ వైఎస్సార్ సీపీలో చేరిన చామర్రు యువకులు

అచ్చంపేట: పెదకూరపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటలా మారింది. గత అయిదేళ్లలో మీకు మంచి జరిగిందనుకుంటేనే ఫ్యాను గుర్తుపై ఓటు వేయాలని కోరుతూ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు గడపగడపకు వెళ్లి అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రచారంలో దూసుకు పోతున్నారు. గ్రామ గ్రామాన జరిగిన అభివృద్ధి కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నారు. సచివాలయాలు, రైతుభరోసాకేంద్రాలు, హెల్త్ క్లినిక్‌లు, అంతర్గత రహదారులు, సైడు కాలువలు, కార్పోరేటు స్థాయిలో ఆధునీకరించబడిన ఇంగ్లీషు మీడియం పాఠశాలలు, వీధివీధిన మంచినీటి కుళాయిలు ఇవన్నీ అభివృద్ధి జరగలేదనేవారి చంపలు చళ్లుమనిపిస్తున్నాయి.

వైఎస్సార్ సీపీని ఎదుర్కోవడం ఎలా...

గత ఐదేళ్లలో సంక్షేమం పథకాలు, అభివృద్ధి పనులతో నియోజకవర్గంలో పాతుకుపోయిన వైఎస్సార్ సీపీని, ఎమ్మెల్యే నంబూరు శంకరరావును ఎలా ఎదుర్కోవాలో టీడీపీ కూటమికి మింగుడు పడటం లేదు. తమ పాలనలో నియోజకవర్గంలో చెప్పుకోవడానికై నా కనీసం ఒక్క అభివృద్ధి కనిపించకపోవడంతో గ్రామాలలో తిరగలేక, ప్రజలవద్దకు వెళ్లే సాహసం చేయలేక అక్రమమార్గాల కోసం అన్వేషిస్తున్నారు. అందులో భాగంగానే ముందుగా వైఎస్సార్ సీపీ నాయకులను ప్రలోభపెట్టే ప్రయత్నాలు మొదలు పెట్టారు. తమ పార్టీకి చెందిన ఇద్దరు ముఖ్యమైన నాయకులు కొన్ని కేసుల్లో అండర్ గ్రౌండ్‌లో ఉన్నారు. వారు రాగానే మీకు భారీ మొత్తాలను ఇస్తామంటూ మభ్యపెట్టి టీడీపీ కండువాలు కప్పి ఫోటోలు తీసి సోషల్ మీడియా తెరపైకి ఎక్కిస్తున్నారు. వాటిని చూపి కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధువులు కల్పించుకుని, ఇలా చేశావేంటిరా..అయిదేళ్లుగా ఏడాదికి రూ.50వేల నుంచి లక్ష రూపాయలవరకు లబ్ధి పొందాం.. పిల్లలు ఇంగ్లీషు మీడియం చదువుతున్నారు... ప్రభుత్వంద్వారా అన్ని రకాల రాయితీలు వస్తున్నాయి కదా వైఎస్సార్ సీపీని కాదని వేరే పార్టీకి వెళ్లడం ఎంతవరకు న్యాయమో ఆలోచించమని హితబోధచేస్తున్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా పథకాలన్నింటిని నేరుగా బ్యాంకులకు జమచేసే జగన్‌మోహనరెడ్డి వైపే ఉందామని నచ్చచెబుతున్నారు. టీడీపీ ప్రలోభాలకు లొంగి టీడీపీ కండువాలు కప్పించుకున్న అనేకమంది చేసిన పొరపాటును తెలుసుకుని మళ్లీ ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వద్దకు వెళ్లి 'పొరపడ్డాం.. మళ్లీ వైఎస్సార్ సీపీలో చేరతాం' అంటూ పార్టీ కండువాలు కప్పించుకుంటున్నారు.

పొరపాటును సరిదిద్దుకున్న చామర్రు యువకులు

పశ్చాత్తాపానికి మించిన ప్రాయచిత్తం లేదంటారు. ఆ సూత్రాన్ని అనుసరించి పొరబడిన చామర్రు యువకులు చేసిన పొరపాటును సరిదిద్దుకుంటూ శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వద్దకు వెళ్లి మళ్లీ వైఎస్సార్ సీపీ కండువాలు కప్పించుకున్నారు. వారిలో 16వ వార్డు మెంబరు గౌతుకట్ల సైదారావు, గౌతుకట్ల శ్రీను, నంబుల వీరాంజనేయులు, కోనంగి అర్జునరావు, నందిగం వసంతరావు, సింగారపు శేషయ్య, గౌతుకట్ల సుధాకర్, గౌతకట్ల అంకమ్మరావు, గౌతుకట్ల మహాలక్ష్మయ్య, తెల్లమేకల సుబ్బారావు, మంచాల ప్రకాష్, క్రీస్తురాజు, నందిగం ఏలేష్‌బాబు, చిగురుపాడుకు చెందిన గంధం హనుమంతరావు, గంధం కోటేశ్వరమ్మ, కోనూరు గ్రామానికి చెందిన పాగెల్లి వెంకటేష్ తదితరులు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చేత పార్టీ కండువాలు కప్పించుకున్నారు.

'కోడ్' కూసినా.. కనిపించదా?



పెద్ద మక్కెనలో జెడ్పీ పాఠశాల ఎదుట ఎన్టీఆర్ సుజల స్రవంతి



పెద్ద మక్కెనలో శ్మశాన వాటికకు ఇలా



పెద్ద మక్కెనలో పేర్లు, పసుపు రంగుతో సిమెంట్ బల్ల



గుడిపూడిలో మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద శిలాఫలకం

- శిలా ఫలకాలు, ఆర్చిలపై తొలగని టీడీపీ నేతల పేర్లు
- సిమెంట్ బల్లలకు తొలగించని పేర్లు, పసుపు రంగు

సత్తెనపల్లి: ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చి ఆరు రోజులు కావస్తున్నా .. నిర్దేశిత నిబంధనల అమలులో నిర్లక్ష్యం కనిపిస్తోంది. కోడ్ అమల్లో భాగంగా.. ప్రభుత్వ ఆస్తులపై రాజకీయ పార్టీల జెండాలు, బ్యానర్లు, నేతల ఫోటోలు, పేర్లు ఉండరాదని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినా చాలా చోట్ల క్షేత్రస్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. సత్తెనపల్లి మండలం పెదమక్కెన, గుడిపూడి గ్రామాలతోపాటు పట్టణంలో నాలుగున్నరేళ్ల కిందట వేసిన టీడీపీ శిలా ఫలకాలు, ఆర్చిలపై పేర్లు, రంగులు, సిమెంట్ బల్లలపై పేర్లు, పసుపు రంగులు దర్శనమిస్తున్నా పట్టించుకోవడం లేదు. ఎన్నికల నియమావళి అమలు చేసే విషయంలో ఇప్పటికై నా అధికారులు నిర్లక్ష్యం వీడాలని ప్రజలు కోరుతున్నారు.

పొడపాడులో పోలీసు కవాతు



పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా మండలంలోని పొడపాడు గ్రామంలో ఎస్ఐ విప్పర్ల వెంకట్రావు ఆధ్వర్యంలో బార్డర్ సెక్యూరిటీ ఫోర్సుతో శనివారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ప్రజలు కూడా ఎక్కడైనా సమస్యలు వస్తే పోలీసులకు తెలియపరచాలని కోరారు.

జ్యూస్, తినుబండారాల దుకాణాల తనిఖీ

రొంపిచర్ల: మండల కేంద్రమైన రొంపిచర్లలో పల్నాడు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి సీహెచ్. లక్ష్మీనారాయణ శనివారం పర్యటించారు. గ్రామంలోని జ్యూస్, తినుబండారాల షాపులను ఆయన తనిఖీ చేశారు. ఆహార పదార్థాల తయారీలో భద్రతా చర్యలు చేపట్టాలన్నారు. ముఖ్యంగా పరిశుభ్రతను పాటించాలని చెప్పారు. ఆహార పదార్థాలు, జ్యూస్ తయారీలో ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే రంగులు, రసాయనాలను ఉపయోగించరాదని సూచించారు. దుకాణ నిర్వాహకులంతా విధిగా లైసెన్స్‌లు తీసుకోవాలని, గడువులు ముగిస్తే రెన్యువల్ చేయించుకోవాలని తెలిపారు.

మోటారు వైర్ల దొంగలను పట్టుకోండి

పిడుగురాళ్ల: పిడుగురాళ్ల పట్టణ పరిసర ప్రాంతాల్లోని పంటపొలాల్లోని మోటార్ల వైర్లను కొందరు దుండగులు దొంగలిస్తున్నారని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం రాత్రి పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. పట్టణ పరిసర ప్రాంతాల్లోని సుమారు 40 మంది రైతులకు చెందిన బోర్లలోని మోటార్ల వైర్లను దొంగలించారని రైతులు ఫిర్యాదు చేశారు. కొల్లి సత్యం, గుదె హనుమంతురావు, గర్నేని సైదారావు, కాకర్ల శీతారామయ్య, రాయపాటి చిన్నా, కరాలపాటి సైదా, వున్నం శేషయ్య, బద్దుల వెంకటేశ్వర్లు, ఉటుకూరి ఆంజనేయలు మరికొంత మందితో కలిసి పట్టణ సీఐ పీవీ ఆంజనేయలుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రైతుల పంట పొలాల్లోని బోరుల్లోని మోటార్లకు చెందిన కాపర్ వైర్లను దొంగతనం చేసిన వారిని గుర్తించి వేంటనే పట్టుకునేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరిక



ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ మైనార్టీ కార్యకర్తలు



టీడీపీ కార్యకర్తలను కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నంబూరు

కండువా కప్పి ఆహ్వానించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పెదకూరపాడు: నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ చేరికలు పెరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి నచ్చి ఎంతోమంది వైఎస్సార్ సీపీ చేరుతున్నారు. పెదకూరపాడు గ్రామానికి చెందిన టీడీపీ షేక్ రియాజ్, సయ్యద్ నాగుల్, షరీఫ్, కాశిమ్ షరీఫ్, పఠాన్ గాలి సైదా, పెదకూరపాడు మండలం పాటిబండ్ల గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త సయ్యద్ కాజా తదితరులు శనివారం ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్ సీపీ చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు స్వయంగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్సీపీ గెలుపు కోసం అందరూ కలసి పని చేయాలని సూచించారు. వైఎస్సార్ సీపీ కుటుంబంలో చేరిన ప్రతి ఒక్కరికి తాను అండగా ఉంటానని ఎవరికి ఏ అవసరమొచ్చినా తాను ఉన్నాననే విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఆయా గ్రామాల పార్టీ నాయకులు, మండల వైఎస్సార్సీపీ నాయకులు పాల్గొన్నారు.

అమరావతి: మండలంలోని మునుగోడు గ్రామానికి చెందిన 10 కుటుంబాలు శనివారం వైఎస్సార్ సీపీలో చేరాయి. టీడీపీ కార్యకర్తలైన షేక్ బాదుల్లా సాహెబ్, షేక్ మహబూబ్ సుభాని, షేక్ నాగుల్, షేక్ మహబూబ్ సుభాని, షేక్ రఫీ, షేక్ సైదా సాహెబ్, షేక్ నాగుల్ మీరా, షేక్ జాన్ సైదా, మేకల తిరుపతిరావు(మీరయ్య)లను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి అహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు మాట్లాడారు. ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని చెప్పారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు కోసం అందరూ కలసి పనిచేయాలని సూచించారు. ఈ కార్య క్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, మాజీ ఎంపీపీ వెంపాజ్వాలా లక్ష్మీ నరసింహారావు, గ్రామ సర్పంచ్ బంకా విష్ణు, వైఎస్సార్ సీపీ నాయకులు నంబూరు బాబురావు, పుల్లా రెడ్డి, సైదారెడ్డి, సలావుద్దీన్ తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలోని దిడుగు గ్రామంలో ముస్లిం సోదరులు నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తేళ్ల రోశయ్య తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి

చిలకలూరిపేట: యువత భగత్‌సింగ్ ఆశయసాధనకు కృషి చేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామ సుబ్బాయమ్మ చెప్పారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతిని శనివారం నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా భగత్‌సింగ్ పోరాడితే నేడు మోదీ ప్రభుత్వం వారినే ఆహ్వానించి దేశసంపదను కట్టబెడుతోందని విమర్శించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు తాళ్లూరి బాబూరావు, పేలూరి రామారావు, చెరుకుపల్లి నిర్మల, నాయుడు శివకుమార్ పాల్గొన్నారు.

28 నుంచి వార్షికోత్సవాలు

రెంటచింతల: స్థానిక సుబ్బన్నతోట కాలనీలో వేంచేసిన అలివేలుమంగా పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం 20వ వార్షికోత్సవాలు ఈ నెల 28 నుంచి ప్రారంభమవుతున్నట్లు దేవస్థానం అధ్యక్షుడు నాళం పెద్దబాబు, ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతిశర్మ శనివారం తెలిపారు. 28 గురువారం ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవ, గణపతి పూజ, పుణ్యాహ వాచనము, కలశస్థాపన, కంకణధారణ, నవగ్రహ మండపారాధన, అఖండ దీపారాధన, పంచా మృతాభిషేకాలు, 8.30 గంటలకు లక్ష్మీ గణపతి హోమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 9.30 ని.లకు లక్ష తులసీ దళార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించి అనంతరం నీరాజనం, మంత్ర పుష్పం చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలను అందచేయడం జరుగుతుందన్నారు. 29 శుక్రవారం ఉదయం 8 గంటలకు సుదర్శన హోమం, స్వామి వారికి అమ్మవార్లకు ఎదురుకోల మహోత్స వం, 11 గంటలకు స్వామివారి శాంతి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు, అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు మహాన్నదానం చేపట్టనున్నట్లు దేవస్థానం పాలకవర్గం సభ్యులు తెలిపారు.

రంజాన్ ఉపవాసం.. పరమ పవిత్రం

- నిగ్రహంతో కూడిన ఆధ్యాత్మిక చింతనే ఉపవాస దీక్ష
- సత్తెనపల్లిలో ఇఫ్తార్ విందులో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు



ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: రంజాన్ మాసంలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాసం నిర్దిష్ట నియమాలతో కూడుకున్న జీవన విధానమని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. పట్టణంలోని షాదీ ఖానా వద్ద శనివారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రతి కార్యకర్తనూ ఆప్యాయంగా పలకరిస్తూ స్వయంగా భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఉపవాస దీక్ష లక్ష్యం మనిషిలో దైవభీతి, దేవుడిపట్ల నమ్మకం మొదలైన మహత్తరమైన సుగుణాలనుపెంపొందింపజేయడమేనన్నారు. ఇఫ్తార్ విందుకు పట్ట ణంలో ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా ఒకరికి ఒకరు అలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, షేక్ జాని, ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు షేక్ కరీం, ముస్లిం మత పెద్దలు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

ముద్దాయిలు సత్ప్రవర్తనతో మెలగాలి

సత్తెనపల్లి సివిల్ జడ్జి డి.నాగ వెంకటలక్ష్మి



సబ్ జైలు సందర్శనలో న్యాయమూర్తి నాగ వెంకటలక్ష్మి

సత్తెనపల్లి: క్షణికావేశంలో చేసిన తప్పులు గమనించి ముద్దాయిలు సత్ ప్రవర్తనతో మెలగాలని సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) డి.నాగ వెంకటలక్ష్మి అన్నారు. పట్టణంలోని సబ్ జైల్‌ను శనివారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడారు. న్యాయ వాదులను నియమించికొనే ఆర్థిక స్థోమత లేని ముద్దాయిలకు ప్రభుత్వ న్యాయ సహాయ న్యాయవాదిని న్యాయస్థానమే నియమిస్తుందన్నారు. ఉచితంగా న్యాయ సేవలు పొందవచ్చునన్నారు. ముద్దాయిలకు పలు సూచనలు చేశారు. సబ్ జైల్లోని వంటశాలను పరిశీలించారు. అక్కడ పరిసరాలను, పదార్థాలను పరిశీలించి ముద్దాయిలతో మాట్లాడారు. సీనియర్ న్యాయవాది బి.ఎల్. కోటేశ్వరరావు ఉన్నారు.

సకాలంలో సస్యరక్షణతో అధిక దిగుబడులు



విప్పర్లలో రైతులకు పంటలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ కళాశాల విద్యార్థులు

రొంపిచర్ల: మండలంలోని విప్పర్లలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు శనివారం రూరల్ అవేర్‌నెస్ వర్క్ ఎక్స్‌పీరియన్స్ ప్రోగ్రాంను నిర్వహించారు. పల్నాడు జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ రమేష్, వరప్రసాద్ నేతృత్వంలో గ్రామంలోని రైతులకు వ్యవసాయంపై అవగాహన, మెలుకువలపై అవగాహన కల్పించారు. సాగు చేస్తున్న పైర్లు, వాటికి ఆశించే చీడపీడల నివారణ, అధిక దిగుబడులు కోసం తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు తదితర అంశాలపై సూచనలు, సలహాలు అందజేశారు. శివాలయ ప్రాంగణంలో గ్రామ పటం, సమస్యల వృక్షం, వృత్త వలయం, పలు రకాల వంగడాలు, వాటి దిగుబడులు, ధరలు, విశ్లేషణ తదితర అంశాలపై రంగులతో చిత్రాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బాపట్ల వ్యవసాయ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థినులు పి.రాజి, ఎం. సౌమ్య, బి.వేదశ్రీ విద్య, ఏ. వాగ్దేవి, ఎన్. ఊర్మికతో పాటు స్థానిక రైతు భరోసా కేంద్రం చైర్మన్ సానికొమ్ము రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చికిత్సతో క్షయ వ్యాధి పూర్తిగా నయం



గణపవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్ ప్రసాద్ నాయక్, వైద్య సిబ్బంది

నాదెండ్ల: క్రమం తప్పకుండా వైద్యం, పౌష్టికాహారం తీసుకుంటే క్షయవ్యాధి నుంచి పూర్తిగా కోలుకోవచ్చని వైద్యాధికారి ఎల్. ప్రసాద్‌నాయక్ చెప్పారు. గణపవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో జాతీయ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. ఆదివారం నుంచి క్షయవ్యాధి మాసోత్సవాల సందర్భంగా శనివారం పీహెచ్‌సీ నుంచి గ్రామంలోని బొడ్డురాయిసెంటర్ వరకూ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకప్పుడు క్షయ వ్యాధి ప్రాణాంతకమైనదని, ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన మందులు లభిస్తున్నాయని తెలిపారు. రోగి ఇంటి వద్దకే వైద్య సిబ్బంది క్రమం తప్పకుండా వచ్చి మందులు అందిస్తారన్నారు. మంచి పౌష్టికాహారం, సరైన వైద్యంతో క్షయవ్యాధి తగ్గిపోతుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది నాసరయ్య, జానకీదేవి, రహమాన్‌బాషా, ఆశాలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

ఘనంగా అర్‌వీవీఎన్ కళాశాల ఫేర్వెల్ డే



విద్యార్థులతో ఉపాధ్యాయులు

అమరావతి: మండల పరిదిలోని ధరణికోట రాజా వాసిరెడ్డి వెంకటాద్రినాయుడు డిగ్రీ కళాశాలలో ఫేర్‌వేల్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చలపతి విద్యా సంస్థల అధినేత అంజనేయులు, ధాన్య కటక బుద్ధ విహార ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావులు విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా గతేడాది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు బహూమతులు ప్రదానం చేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈకార్యక్రమంలో కళాశాల పాలకవర్గ సభ్యులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ,గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ మైనింగ్‌ను అడ్డుకున్న పోలీసులు

కారెంపూడి: కారెంపూడి మండలంలో యథేచ్ఛగా జరుగుతున్న అక్రమ మైనింగ్‌ను శనివారం పోలీసులు అడ్డుకున్నారు. ఒక పొక్లెయిన్, ట్రాక్టర్లను పోలీసులు స్టేషన్‌కు తరలించారు. పంట పొలం కొనడం లేదా కౌలుకు తీసుకుని ఆ పొలాలలో ఎక్కువ లోతు, ఒక్కో చోట స్తంభం లోతు గుంతలు తీసి ఆ మట్టిని లక్ష్మీపురం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ ఒకరు అమ్ముకుంటున్నాడని అందిన సమాచారం మేరకు పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామ కాలనీ వద్ద పొలంలో ఎక్కువ లోతులో గ్రావెల్ తరలించడంతో ఆ ప్రాంతం ప్రమాదభరితంగా తయారయిందని, అలాగే లక్ష్మీపురం గ్రామంలో రెండెకరాలు కౌలుకు తీసుకుని ఆ మట్టిని కూడా అమ్ముకుంటూ వ్యాపారం చేస్తున్నారని ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా మైనింగ్‌కు పాల్పడుతున్నాడని గుర్తించారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్న ఘటనపై కేసు నమోదు చేశారు.